సాక్షి
ప్రకాశం
బుధవారం ı 1 ı నవంబర్ ı 2023



సర్దార్ స్ఫూర్తిని కొనసాగిద్దాం
దేశ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. - 8లో..



దేశ సమైక్యతకు పునరంకితమవుదాం
దేశ సమగ్రత కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమైక్యతకు పునరంకితమవుదామని ఏఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34.1/25.9

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాచర్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో నిధులు

ఒంగోలు: గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని రాచర్ల రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి లేదా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు అందగానే నిధులు మంజూరు చేస్తామని రైల్వే బోర్డు ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రకుమార్ గోయల్ మంగళవారం రాతపూర్వకంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి తెలిపారు. ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ జైరాం గడ్కరీ, రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి ఢిల్లీలో చర్చించిన విషయాన్ని వివరించారు. రైల్వే గేటు వద్ద ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను వివరించి రైల్వే ఓవర్/అండర్ పాస్ బ్రిడ్జిని సీఆర్‌పీఎఫ్ నిధుల ద్వారా మంజూరు చేయాలని కోరారన్న విషయాన్ని ప్రస్తావించిన సంగతి తెలిసిందే. దీనిపై రైల్వే బోర్డు ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రకుమార్ గోయల్ సమాధానం ఇస్తూ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి సాంకేతిక సాధ్యత, డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు జోనల్ రైల్వే వద్ద నుంచి రావాల్సి ఉందని, రిపోర్టు అందిన వెంటనే నిధులు మంజూరు చేస్తామని లిఖిత పూర్వంగా తెలిపారు.

సమగ్రశిక్షలో ఎంఆర్ కేటగిరీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జేసీ కె.శ్రీనివాస్

ఒంగోలు: సమగ్రశిక్షలో ఎంఆర్ కేటగిరీలో విద్యార్థులకు బోధన అందించేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో 1:3 నిష్పత్తి ప్రకారం 30 మందికి మంగళవారం స్థానిక సమగ్రశిక్షలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు జేసీ కె.శ్రీనివాస్ నేతృత్వంలో జరిగాయి. అయితే 28 మంది మాత్రమే హాజరయ్యారు. ఎంపికైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి 11 మందికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. బుధవారం హియరింగ్ ఇంపెయిర్డ్, విజువల్లీ ఇంపెయిర్డ్ కేటగిరీకి దరఖాస్తు చేసుకున్న వారికి 15 పోస్టులకుగాను 40 మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. ఈ ఇంటర్వ్యూ కార్యక్రమంలో డీఈవో వీఎస్ సుబ్బారావు, బాపట్ల జిల్లా ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామారావు, ఐఈ కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో ఉత్సాహంగా ఖోఖో ఆడుతున్న బాలికలు

కనిగిరి రూరల్: మండలంలోని పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో జిల్లా స్థాయి బాలికల టీంకు జరుగుతున్న శిక్షణ మంగళవారం ఎంతో ఉత్సాహంగా సాగింది. పీడీలు కాశీ విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సావిత్రమ్మల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14 విభాగం బాలికల ఖోఖో జట్టు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ విభాగంలో ఈనెల 9 నుంచి 11 వరకు చిత్తూరులో జరిగే పోటీల్లో ఆడనున్నారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో సమావేశం

- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితాలో వృద్ధుల వయస్సు, డోర్ నంబర్ల విషయంలో పొరపాట్లు చోటు చేసుకుంటే రెండు వారాల్లో వాటిని సరిచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన అన్నీ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. దీనిలో ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌తో పది మందికి పైగా ఓటర్లు ఉంటే అటువంటి కేసుల వాస్తవికతను పరిశీలించాలన్నారు. 80 ఏళ్లకు పైబడిన ఓటర్ల సంఖ్య వాస్తవికతను పునఃపరిశీలించాలన్నారు. ఎలక్టోరల్ పనులన్నీ నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఈఆర్ఓ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూహక్కు

సమాజంలో దళితులు గౌరవంగా బతికేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం ద్వారా శాశ్వత భూహక్కు పత్రం, యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రత్యేక జీఓ జారీ చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా హక్కుపత్రాలను సైతం ముద్రించి జిల్లాకు పంపింది. దీంతో దళితుల కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి.

- సంపూర్ణ భూహక్కు పథకంతో దళితుల చేతుల్లోకి భూమి హక్కు పత్రాలు
- తనఖాలో ఉన్న డాక్యుమెంట్ల విడుదలకు జీఓ 51 జారీ
- జిల్లాలో 1915 దళిత కుటుంబాలకు 1741 ఎకరాలకు భూహక్కు
- హర్షం వ్యక్తం చేస్తున్న దళితులు




దర్శి:

దళితుల సంక్షేమం కోసం నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వారి రుణాలు మాఫీ చేశారు. 1982 నుంచి 2008 వరకు భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలువురు దళితులు భూములు పొందారు. వీరికి రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేస్తూ వైఎస్ రాజశేఖరెడ్డి హయాంలో జీఓ నంబర్ 492ను జారీ చేశారు. అయితే రుణాలు మాఫీ అయినా భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు ఎస్సీ కార్పొరేషన్ లో తనఖాలోనే ఉండిపోయాయి. భూములు పొంది వ్యవసాయం చేసుకుంటున్న దళితులు హక్కు పత్రాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న డాక్యుమెంట్లను రిలీజ్ చేసి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రభుత్వమే ముద్రించిన భూ యాజమాన్య హక్కు పత్రాలు జిల్లాకు చేరాయి.

రాష్ట్రంలో 16213.5 ఎకరాలకు, జిల్లాలో 1741 ఎకరాలకు స్వేచ్ఛ:
ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న భూములకు సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీన జీఓ నంబర్ 51ని జారీ చేసింది. ఈ జీఓ ప్రకారం జిల్లాలోని లబ్ధిదారుల భూములకు యాజమాన్య హక్కులు అందించడంతో పాటు వాటికి అయ్యే రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఒక్కో లబ్ధిదారునికి భూమిని ఇచ్చేందుకు రూ.1200 ఖర్చవుతుంది. ఈలెక్కన రాష్ట్రంలో 14223 మంది లబ్ధిదారులకు రూ.1,70,67,000, జిల్లాలో 1915 మంది లబ్ధిదారులకు రూ.2,13,34,500ల ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది.

ఈ పథకం కింద భూములు పొందిన లబ్ధిదారులు ఎవరైనా మృతి చెంది ఉంటే వారి వారసుల వివరాలను పక్కాగా సేకరించి వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందిస్తున్నారు. అలాగే జీఓఎంఎస్ నంబర్ 501 ప్రకారం రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీలను కూడా ప్రభుత్వమే భరించి హక్కు పత్రాలు అందిస్తుంది.



భూయాజమాన్య హక్కు పత్రం

నిషేధిత జాబితా భూములు కూడా..
కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత జాబితాలోని 769 మంది లబ్ధిదారులకు కూడా భూహక్కు పత్రాలు అందజేస్తున్నారు. వీరిని నిషేధిత జాబితా నుంచి తొలగించి వారి పేరున భూహక్కు పత్రాలు అందజేస్తారు.

దళిత రైతులకు యాజమాన్య హక్కులు:
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రుణాలు మాఫీ అయినా ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్న దళిత రైతులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను వారికి అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో 14223 మందికి, జిల్లాలో 1915 మందికి రుణాలు అప్పట్లోనే మాఫీ కావడం , దళిత ప్రజల కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రాష్ట్రంలో 16213.5 ఎకరాలకు, జిల్లాలో 1741 ఎకరాలకు యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. దీంతో దళితుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

భూమి హక్కు పత్రాలు అందించేందుకు అంతా సిద్ధం చేశాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భూహక్కు పత్రాలను అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నాం. మృతి చెందిన వారు ఉంటే వారి వారసులకు గుర్తించి వారికి పత్రాలు అందిస్తాం. నిషేధిత జాబితాలో ఉన్నవారికి కూడా జాబితా నుంచి తొలగించి భూహక్కు పత్రాలు అందిస్తున్నాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే ఈ భూహక్కు పత్రాలతో వారు పూర్తి హక్కుదారులవుతారు.

– ఏఎస్ దినేష్ కుమార్, కలెక్టర్

త్వరలోనే యాజమాన్య హక్కు పత్రాలు



భూమి హక్కు పథకానికి సంబంధించి మా కార్యాలయంలో తనఖాలో ఉన్న పత్రాలను అందించేందుకు కలెక్టర్ ఏఎస్‌దినేష్ కుమార్ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం ముద్రించి పంపిన భూమి యాజమాన్య హక్కు పత్రాలు కార్యాలయానికి చేరాయి. త్వరలోనే ఈ హక్కు పత్రాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపడతారు. ఆ తరువాత జిల్లా మొత్తం లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందిస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చిన హక్కు పత్రాల్లో లబ్ధిదారుని పేరు, చిరునామా, విస్తీర్ణం, హద్దులు తదితర వివరాలన్నీ ఉన్నాయి.

– కే అర్జున్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు

నకిలీ దస్తావేజుల కేసులో ముగ్గురి అరెస్టు

ఒంగోలు టౌన్: నకిలీ దస్తావేజుల కేసులో మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామ శివారులో ముంగమూరు రోడ్డులోని రామచంద్ర మిషన్‌కు చెందిన కంటు నారాయణమ్మకు చెందిన సర్వే నంబర్ 163లో 50 గదుల భూమి ఉంది. ఈ భూమికి ఇటీవల డిమాండ్ పెరగడాన్ని గమనించిన కొందరు వ్యక్తులు దానిమీద కన్నేశారు. అనుకున్నదే తడవుగా సదరు భూమిని ఆక్రమించుకోవాలని కుట్ర పన్నారు. భూమికి సంబంధించి ల్యాండు కన్వర్షన్ సర్టిఫికెట్లు, సర్వే రిపోర్టులతో పాటుగా డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను సృష్టించారు. నకిలీ డాక్యుమెంట్ల సహాయంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ మేరకు తాలుకా పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో సిట్ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు అధికారి పామూరు సీఐ కె.శ్రీనివాసరావు ముద్దాయిలను అరెస్టు చేశారు. ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెం గ్రామానికి చెందిన గాలం పద్మావతి, ఒంగోలు నగరంలోని భూపతివారి వీధికి చెందిన స్వర్ణ నాగేంద్రుడు, గోపాల్ నగర్‌కు చెందిన ముంతా సుబ్రమణ్యంలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ముద్దాయిల నుంచి నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఒంగోలు: స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర కన్వీనర్ కటారి శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అమరజీవి పొట్టిశ్రీరాములు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొంటారన్నారు.

కుటుంబాలు అందరికీ ఉంటాయి..

- ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేయడం మానుకోవాలి
- నిజాన్ని తట్టుకోలేకే 'సాక్షి'పై అక్కసు
- నకిలీ పట్టాల కుంభకోణంలో నిందితులంతా టీడీపీ వారే
- వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్

ఒంగోలు: కుటుంబాలు మీకే కాదు.. మాకు కూడా ఉంటాయని పచ్చమీడియా, యూ ట్యూబ్ చానళ్లు ఉన్నాయి కదా అని ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ టీడీపీ నాయకులకు హితవు పలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తుండడాన్ని తట్టుకోలేక టీడీపీ నాయకులు 'సాక్షి' దినపత్రికపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, టీడీపీ తీరు గురివింద గింజ సామెతలా ఉందన్నారు. నకిలీ దస్తావేజుల కేసుల్లో టీడీపీ నాయకులు అరెస్టవుతుండడం తట్టుకోలేక వారు తమ కార్యకర్తలే కాదని, వారికి సభ్యత్వం లేదని బుకాయించడం హాస్యాస్పదమన్నారు. 29వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలైన వ్యక్తి విషయంలో మాత్రం వారి పార్టీ నాయకులు, కార్యకర్తలు కాదని చెప్పుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. నిత్యం ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో పతాక శీర్షికల్లో లేనిది ఉన్నట్లుగా బాలినేనిపైన, వారి తనయుడు ప్రణీత్‌రెడ్డిపైన వార్తలు రాయవచ్చా అని నిలదీశారు. ఇకనైనా పచ్చమీడియాలో బాలినేని కుటుంబంపై తప్పుడు రాతలు మానుకొని హుందాగా రాజకీయాలు చేయాలన్నారు. 'సాక్షి' పత్రిక రాష్ట్రంలోనే అత్యంత జనాదరణ కలిగిన పత్రిక అని తెలుసుకోవాలన్నారు. టిష్యూ పేపర్ ఏమిటో మీ తోక పత్రికను చూస్తే తెలుస్తుందన్నారు. బాలినేని నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి గనుకే అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, వచ్చే ఎన్నికల్లో విజేత ఎవరనేది ప్రజలు నిర్ణయిస్తారని, అంతే తప్ప మీరు కూసే కూతలు కాదంటూ మండిపడ్డారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ నకిలీ దస్తావేజుల కేసులో మొదటగా స్పందించి కేసులు పెట్టమని చెప్పిందే బాలినేని అని, అటువంటి వ్యక్తిపై విమర్శలు చేయడం, అది కూడా కనీస స్థాయిలేని వ్యక్తులు చేయడం సరికాదన్నారు. వైశ్యుల అభివృద్ధి జరిగింది అంటే అది ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అన్నారు. 52 వేలమంది ఆర్యవైశ్యులకు సంక్షేమ ఫలాలు అందుకుంటున్నారన్నారు. ఆర్యవైశ్యుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అవతరణను నవంబరు ఒకటో తేదీకి మార్చడం, చింతామణి నాటకంపై జారీచేసిన ఉత్తర్వులు, వాసవీ అమ్మవారి ఆస్తులు ఆర్యవైశ్యులే నిర్వహించుకునేలా ఉత్తర్వులు జారీచేయడం వంటివన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 35 వేల మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కొక్కరికి దరఖాస్తు చేసుకునేందుకే రూ.500లు ఖర్చు అయితే చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం అందని విషయాన్ని చేతనైతే వివరించాలని సవాల్ విసిరారు. ఎన్‌టీఆర్‌ను పదవి నుంచి దించే సమయంలో మీరు ఆడింది ఆట..పాడింది పాటగా రాసే పత్రికలు ఉండబట్టి మీ ఆటలు సాగాయని, కానీ నేడు 'సాక్షి' ఆవిర్భావంతో జనాలకు నిజం ఏమిటో తెలుసుకోగలుగుతున్నారన్నారు. అందుకే 'సాక్షి' పత్రికపై ఎల్లో మీడియాకు, మరో వైపు పచ్చపార్టీకి కంటగింపుగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్ అన్నారు. బాలినేనికి సీఎంను కలవడానికి అపాయింట్‌మెంట్ అవసరం లేదని, ఎన్ని విమర్శలు చేసినా విజయం మా నాయకుడు బాలినేనిదే అని స్పష్టం చేశారు. భూదందాలు ప్రారంభమైందే 2014–19 మధ్య అని, అవినీతి విజృంభించినా, కమీషన్ల పర్వం కొనసాగినా అది గత ప్రభుత్వ హయాంలోనే అన్నారు. ఒంగోలు క్లస్టర్ 1 ఇన్‌చార్జి రాయపాటి అంకయ్య మాట్లాడుతూ పచ్చమీడియా, యూ ట్యూబ్ చానళ్లు ఉన్నాయి కదా అని ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేయడం మానుకుని ప్రజల్లో మంచి పేరు సంపాదించుకునేందుకు ప్రయత్నించాలని అన్నారు. మీ పచ్చ పత్రికలు మీ పార్టీ అధిష్టానం సామాజిక వర్గ నేతలు తప్ప ఇంకెవరూ చదవరని, నేడు ప్రతి ఇంటి పత్రికగా 'సాక్షి' ఉందన్నారు. క్లస్టర్ 3 ఇన్‌చార్జి గంటా రామానాయుడు మాట్లాడుతూ నకిలీ దస్తాల కుంభకోణంలో అత్యధికంగా ఉన్న పేర్లే టీడీపీ వారివి వస్తున్నాయని, రాబోయే కాలంలో ఇంకెంతమంది వెలుగులోకి వస్తారో వేచి చూడాలన్నారు. సంచార జాతుల వారిని సైతం వడ్డీలతో పీడించే వ్యక్తులు ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడితే వినేందుకు జనం సిద్ధంగా లేరన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి



మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కేటాయించిన పనులన్నీ నిర్ణీత గడువులో చేయాలి
- మండల స్థాయి అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో ప్రకాశం భవనం నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు దీనిపై ప్రత్యేక దృష్టితో పనిచేసేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పురోగతి లేకుంటే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఎంపీడీవోలపై చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్ పనుల్లో పురోగతి లేని పామూరు మండలం ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల సిబ్బంది రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలన్నారు. సేవలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు కేటాయించిన పనులన్నీ చిత్తశుద్ధితో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కొంత మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు మెమోలు ఇచ్చామని వారిలో కొందరు వాటికి వివరణ ఇవ్వలేదని, 48 గంటల్లో వివరణ ఇవ్వకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, డీఈఓ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ మాధురి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, మలేరియా అధికారి జ్ఞానశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఆందోళన వద్దు

- క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా తగిన ఉపశమన చర్యలు చేపడతాం
- ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటుంది
- వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: రైతులకు సంబంధించి ప్రతి విషయంలో ప్రభుత్వం మేలు చేసేందుకు సిద్ధంగా ఉందని, వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. "కోరలు చాచిన కరువు–ఎవరి కళ్లకు గంతలు" అని ఓ దినపత్రికలో వచ్చిన కథనంపై వ్యవసాయాధికారి స్పందించి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా తగిన ఉపశమన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రతి రోజు పరిశీలించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 366.2 మి.మీ ఉండగా, 300.7 మి.మీలుగా నమోదైంది. వ్యవసాయ, ఉద్యాన, ఇతర పైర్లు కలిపి సాధారణ విస్తీర్ణం 5,42,740 ఎకరాలు ఉండగా, 3,11,447.5 ఎకరాలు సాగు చేశారు. 2023 ఖరీఫ్‌కు సంబంధించి పైర్లు 60 శాతం సెప్టెంబర్ నెలలో విత్తారని చెప్పారు.

కంది, మొక్కజొన్న, పత్తి, వరి, మిరప పైర్లు 2023 సెప్టెంబర్ 30 వరకు బాగానే ఉన్నాయని అన్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచి చివరి వరకు దాదాపు నెల రోజులు వర్షపాతం సక్రమంగా నమోదు కానందున మెట్ట పైర్లు, బోర్ల కింద వేసిన వరి, మిరప పైర్లు వాడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్లు చెప్పారు. అందులో వరి 3775, పత్తి 32,787, మొక్కజొన్న 3275, ఆముదం 2432, కంది 80,950 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. డ్రవుట్ 2016 మ్యాన్యువల్ ప్రకారం వర్షపాతంతో కలిపి పైర్లు విత్తిన విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్ వివరాల తేడా, నేల తేమ వివరాలు, భూగర్భ జల నీటి పరిమాణం, భూ ఉపరితల నీటి పరిమాణం వివరాలు తదితర ఆరు సూచికల ప్రకారం 28 మండలాల్లో లోటు వర్షపాతం మండలాలుగా గుర్తించారని చెప్పారు.

వీటిలో 16 మండలాలు అత్యంత లోటు వర్షపాతం మండలాలుగాను, 12 మండలాలు మధ్యస్థ లోటు వర్షపాతం మండలాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా మండలాల్లో పైర్లు వాడిపోయేందుకు సిద్ధంగా ఉన్న వాటి గురించి మండల వ్యవసాయాధికారులు, రైతుభరోసా సిబ్బంది నుంచి రోజువారీ నివేదికలు సేకరించి ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కరువు ఉపశమన చర్యలు చేపడతామని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

'జ్ఞాన జ్యోతి' శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

ఒంగోలు: జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా నిర్వహిస్తున్న 'జ్ఞాన జ్యోతి' శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక రామచంద్ర మిషన్‌లో ప్రారంభమైన ఆరు రోజుల రీజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెరసి మొత్తం 160 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు తమ మండలాల్లో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. కోర్సు డైరెక్టర్ ఎ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను అవగాహన చేసుకుని మండల స్థాయిలో మరింత అవగాహన కలిగించాలన్నారు. రాష్ట్ర పరిశీలకుడు డి.పాల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 బాల్య సంరక్షణ, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు.



జ్ఞాన జ్యోతి శిక్షణ గురించి వివరిస్తున్న గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

ఏఎంవో రమేష్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ ప్రోగ్రాంలో నిర్వహిస్తున్న కార్యక్రమం కనుక వసతుల అమలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. మూడు జిల్లాల ఐసీడీఎస్ పీడీలు శిక్షణ ప్రాధాన్యతను, రెండు డిపార్టుమెంట్లతో కలిసి శిక్షణ పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రథమ్ టీమ్ సభ్యులు రాజశేఖర్, భవాని, సుబ్బారావు, డైట్ లెక్చరర్ రవీంద్ర ప్రసాద్, కీ రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంచేపల్లి పంచాయతీలో నిధులు గోల్‌మాల్

● రూ.2.23 లక్షలు కాజేసిన పంచాయతీ కార్యదర్శి

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కుంచేపల్లి పంచాయతీలో రూ.2.23 లక్షల నిధులు గోల్‌మాల్ అయిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నారాయణ ఈ ఏడాది జూలైలో మర్రిపూడి మండలంలోని ధర్మవరం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వైఎస్సార్ బీమాకు సంబంధించి రూ.20 వేలు, పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిధులు రూ.2.03 లక్షలు.. వెరసి మొత్తం రూ.2.23 లక్షలను పంచాయతీ నిధుల నుంచి డ్రా చేసి సొంతానికి వాడుకున్నారు. ధర్మవరంలోనూ రూ.2.50 లక్షలు స్వాహా చేయడంతో అక్కడి అధికారులు ఎల్‌పీసీ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దీంతో ఇక్కడ అధికారులు ఆయనకు గత నాలుగు నెలల నుంచి వేతన బిల్లు పెట్టలేదని సమాచారం. నిధుల గోల్‌మాల్‌పై ఎంపీడీఓను వివరణ కోరగా వాస్తవమేనని, ఈ విషయంపై డీపీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రూ.59 లక్షల స్వాహా కేసులో నిందితురాలికి మూడేళ్ల జైలు

కనిగిరి రూరల్: దొంగ బిల్లులతో ప్రభుత్వ నగదు రూ.59 లక్షలు స్వాహా చేసిన కేసులో అప్పటి ఎస్టీఓ(సబ్ ట్రెజరరీ అధికారి) ముబారక్ బేబీకి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ మంగళవారం కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పటి జిల్లా అధికారి ఫిర్యాదు మేరకు 2012లో ఎస్టీఓ బేబీ, మరో నలుగురు ఉద్యోగులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ఏ-1గా ఉన్న బేబీకి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఏ3 అయిన శ్రీహరిపై నేరం రుజువు కానందున కేసు కొట్టివేశారు. ఈ కేసులో ఏ2, ఏ4, ఏ5గా ఉన్న నిందితులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివార్లలోని అల్లూరి పోలేరమ్మ గుడివద్ద సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. తర్లుపాడు మండలం కేతగుడిపి గ్రామానికి చెందిన దూదేకుల సద్దాం హుస్సేన్(35) సోమవారం సాయంత్రం తర్లుపాడు నుంచి మార్కాపురానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి అంబులెన్స్‌లో జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం సోమవారం రాత్రి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి గుర్తింపు!

● ప్రత్యేక పోలీస్ బృందాలతో ముమ్మరంగా గాలింపు

మార్కాపురం: దసరా పండుగ రోజున మార్కాపురం పట్టణంలోని ఎన్ఎస్ నగర్‌లో నివాసముంటున్న అర్ధవీడు పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ గోపాలరాజు ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని రాజమండ్రికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను రాజమండ్రితోపాటు హైదరాబాద్‌కు పంపారు. కాగా పట్టణ శివార్లలోని బజాజ్ ఆటో షోరూమ్‌లో ఈ ఏడాది జూలైన 25న రూ.5 లక్షలు నగదు అపహరించిన నిందితుడిని మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. అప్పులపాలైన ఆ వ్యక్తి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఏసీబీ డీఎస్పీకి పోలీస్ మహోన్నత సేవా పతకం


డీఎస్పీ శ్రీనివాసరావు


ఇన్‌స్పెక్టర్ అపర్ణ

ఒంగోలు టౌన్: ఒంగోలు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావును పోలీస్ మహోన్నత పతకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే ఒంగోలు ఏసీబీలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎస్ అపర్ణను పోలీస్ ఉత్తమ సేవా పతకానికి, హెడ్ కానిస్టేబుల్ వి.ప్రసాద్‌ను పోలీస్ సేవా పతకానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించనున్న వేడుకల్లో ఈ అవార్డును అందుకోనున్నారు.

సర్దార్ స్ఫూర్తిని కొనసాగిద్దాం


వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికా గర్గ్


వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలతో ఎస్పీ

● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యతకు పునాదులు వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎస్పీ మలికా గర్గ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉక్కుమనిషి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశంలోని స్వతంత్ర సంస్థానాలన్నిటినీ దేశంలో విలీనం చేయడంలో ఆయన ప్రదర్శించిన పట్టుదల ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ఆయన సంకల్పాన్ని భవిష్యత్ తరాలు ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

పోటీల్లో విజేతలకు బహుమతులు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతోపాటుగా రన్ ఫర్ యూనిటీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతిక పాత్ర అంశంపై పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు సిబ్బంది

మొదటి బహుమతి : డి.శ్రీనివాసరావు(టంగుటూరు) , **ద్వితీయ బహుమతి** : ఒ.నారాయణ రెడ్డి(సంతనూతలపాడు) , తృతీయ బహుమతి : జాన్ వెస్లీ(సంతనూతలపాడు)

లైంగిక వేదింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో సామాజిక పాత్రపై వ్యాస రచనలో విజేతలుగా నిలిచిన పోలీసుల పిల్లలు

పి.భానమతి తేజశ్విని(అపెక్స్ హైస్కూలు, ఒంగోలు), టి.కీర్తన(సంస్కృతి హై స్కూలు, కందుకూరు) , కె.మనోజ్ఞ(అపెక్స్ హైస్కూలు)

లైంగిక వేదింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో సామాజిక పాత్రపై వక్తృత్వ పోటీల్లో..

షేక్ నిమ్రా(జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కనిగిరి)

ఎస్.సాయి సహస్ర (పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల, ఒంగోలు)

ఎస్.శ్రావణి (జెడ్పీ హైస్కూల్, త్రిపురాంతకం)

వక్తృత్వ పోటీల్లో..

ఎస్డీ అర్మాన్(అపెక్స్ హైస్కూలు, ఒంగోలు)

కె.మహిత(క్విస్ హైస్కూలు, ఒంగోలు)

వై.నిశిత(పేస్ ఎస్ఆర్ ఒలింపియాడ్ స్కూలు, ఒంగోలు)

రన్ ఫర్ యూనిటీలో విజేతలు

వై.క్రాంతి కుమార్

టి.చిన్న రోశయ్య

ఎ.శ్రీనివాసరావు


ఐక్యతా పరుగులో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

దేశ సమైక్యతకు అంకితమవుదాం

● అడ్మిన్ ఏఎస్పీ నాగేశ్వరరావు

● ఘనంగా రన్ ఫర్ యూనిటీ

ఒంగోలు టౌన్: తొలి ఉప ప్రధానిగా, హోంశాఖ మంత్రిగా దేశ సమగ్రత కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమైక్యతకు అంకితమవుదామని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ జయంతిని పురస్కరించుకుని ప్రకాశం భవనం వద్ద రన్ ఫర్ యూనిటీని ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరేడ్ గ్రౌండులో సర్దార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐలు పి.భక్తవత్సల రెడ్డి, లక్ష్మణ్, జగదీష్, అజయ్‌కుమార్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

ఒంగోలు మెట్రో: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి, ఉక్కుమహిళ ఇందిరాగాంధీ 39వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పీ పేరయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగానే కాకుండా స్వాతంత్ర్యం అనంతరం 565 సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి కృషి చేసి విజయం సాధించిన ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ అన్నారు. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. అనంతరం ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని గాంధీ భారత దేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి అని అన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, ఇతర రాజ కుటుంబాల వ్యక్తిగత పన్నుల రద్దు వంటి సంస్కరణలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, జి.శాంసన్, కె.కృష్ణవేణి, ఎస్.అనిల్ బాబు, యం.శివకుమారి, వై.మృదుల్ కుమార్, స్మైలీ, పాల్గొన్నారు.


సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయం సిబ్బంది పాఠకులు

రైతులను దగా చేసిన మోదీ ప్రభుత్వం

ఒంగోలు టౌన్: రైతుల ఆదాయాన్ని పెంచుతానని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ గెలిచి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు విమర్శించారు. మంగళవారం మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశంలో రైతులు పండించిన పంటలకు 38 శాతం తక్కువ ధరలు అందించడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు స్వామినాథన్ సూచించిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా స్వరాజ్ మైదానంలో నిర్వహించే మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 6వ తేదీన్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేయాలని రైతు సంఘం నాయకులు కేశవరావు, కోరారు. ఈ సమావేశంలో జి.శ్రీనివాసులు, నాగరాజు, సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న వడ్డే

మర్రిపూడి-పృథులగిరి
మార్గం సుగమం


ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, నాయకులు

● 10.5 కి.మీ తారు రోడ్డుకు రూ.8.5 కోట్లు మంజూరు

● సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతల క్షీరాభిషేకం

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి బస్టాండ్ సెంటర్ నుంచి పృథులగిరి లక్ష్మీ నృసింహ స్వామి కొండ, ఎస్టీ రాజుపాలెం గ్రామం వరకు 10.5 కి.మీ మేర తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.8.5 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి మండల వైఎస్సార్ సీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నిధులు మంజూరు కావడంలో ఎంపీపీ కృషిని నాయకులు కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షులు బోద రమణారెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు బోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య ముదిరాజ్, అలికేపల్లి కోటేశ్వరరావు, ఇనుకొల్లు మాదిరెడ్డి, వై.శ్రీను, ఈదుమూడి రవి ప్రసాద్ పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

అద్దంకి రూరల్: జిల్లా స్కూల్ క్యాంపస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలకు మంగళవారం స్థానిక మార్కెటింగ్ యార్డులో ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ వయస్సులవారు 75 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్‌జీఎఫ్ బాపట్ల సెక్రటరీ విష్ణుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రోలర్ స్కేటింగ్ సెక్రటరీ జాస్టి కిరణ్, ఒలింపియన్ స్పోర్ట్స్ అకాడమీ ప్రతినిధులు ఆదిత్య, కోచ్ టీవీ పవన్ కుమార్, ఎస్‌కె. అబ్దుల్ లతీఫ్, పర్చూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పీ. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



వరి నాట్లపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఒంగోలు సెంట్రల్: వరి పంటలో నారు నుంచి కోత దశ వచ్చే వరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల బారిన పడకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ అన్నపూర్ణ తెలిపారు. చీమకుర్తి మండలం పాటిమీద పాలెంలో మంగళవారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన కోటయ్య పొలంలో వరి నారు మందు ద్రావణంలో ఉంచిన తర్వాత నాటే విధానం రైతులకు చూపించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారులు శైలజా రాణి, శేషమ్మ పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

నాగులుప్పలపాడు: జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయంలో భూమి కొలతల వివరాలు, రైతుల వద్ద సేకరిస్తున్న సమాచారం అడిగి తీసుకున్నారు. తహసీల్దార్ సుజన్ కుమార్, రీ సర్వే డీటీ, సిబ్బంది ఉన్నారు.

17 మంది డాక్టర్లకు పీజీలో సీటు


డాక్టర్ రాజ్యలక్ష్మిని శాలువాతో సత్కరిస్తున్న ప్రభుత్వ వైద్యులు

ఒంగోలు టౌన్: జిల్లాకు చెందిన ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు 17 మంది ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా త్వరలో విధుల నుంచి రిలీవ్ కానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు పూర్తి చేసుకోవాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు. త్వరలోని వీరి స్థానంలో కొత్త వైద్యులను నియమిస్తారని తెలిపారు.

కూలీల ఆటో బోల్తా, ఆరుగురికి గాయాలు

మేదరమెట్ల: కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం సోమవరప్పాడు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పొలం పనికోసం మేదరమెట్ల నుంచి ప్రాసంగులపాడు ఆటోలో కూలీలు వెళ్తున్నారు. ఆటో మేదరమెట్ల నుంచి సోమవరప్పాడు వద్దకు రాగానే అదుపు తప్పిన ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వ్యాస రచనలో విద్యార్థిని ప్రతిభ

జే.పంగులూరు: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కొండ మంజులూరు విద్యార్థి భవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించింది. ఖాదీ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు బాపట్ల ఏబీఎమ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి అనే మంది విద్యార్థులు హాజరయ్యారు. భవ్యశ్రీని జిల్లా సైన్స్ అధికారి సాధిక్ ప్రశంస పత్రం, రూ.5 వేల నగదు బహుమతి అందించారు. ఈసందర్భంగా విద్యార్థినిని హెచ్ఎం ఐ అనిత, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకట్రావు, నాయకులు జంపాని రవిబాబు తదితరులు అభినందించారు.


భవ్యశ్రీని అభినందిస్తున్న నిర్వాహకులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మార్కాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో మార్కాపురం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన దూదేకుల ఖాశింబీ(23) మంగళవారం పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త ఖాశిం, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.